RNI TELTEL2024/89323

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సెప్టెంబర్ 25 శుక్రవారం 2026 | సంపుటి : 3 | సంచిక : 231 | పేజీలు : 8 | వెల రూ. 6.00/- | ఎడిటర్ : రాచమల్లు మాధవి

Nizamabad | FRIDAY SEPTEMBER 25 2026 | VOL:3 | ISSUE: 231 | PAGES:8 | Rs. 6:00 | EDITOR: Rachamallu Madhavi

## పీఏసీఎస్ ఎన్నికలకు స్వస్తి.. నామినేటెడ్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం

7

# రేవంత్‌కు 'ఆర్యదాన్' గౌరవం.. బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు ఎంపిక

**ఆర్యదాన్ మహమ్మద్ అవార్డు–2026కు తెలంగాణ సీఎం ఎంపిక**

**రైతులు, బీసీలు, సామాన్యుల కోసం చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపు**

**నిలంబూరులో రేపు పురస్కార ప్రదానం.. ప్రజాస్వామ్య విలువలపై నిబద్ధతకు ప్రశంసకులు వెల్లడించారు.**



రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు అవార్డు జ్యూరీ పేర్కొంది. ప్రజాస్వామిక విలువల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతను కూడా జ్యూరీ ప్రస్తావించినట్లు సమాచారం.

ఆర్యదాన్ మహమ్మద్ పేరిట పురస్కారం

కేరళకు చెందిన దివంగత సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ జ్ఞాపకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. ప్రజా సేవ, ప్రజాస్వామ్య విలువలు తదితర అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని అవార్డు గ్రహీతలను ఎంపిక చేస్తున్నట్లు నిర్వాహక వర్గాలు తెలిపాయి. ఈసారి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' విభాగంలో ఎంపిక చేశారు. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 25న నిలంబూరులో అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆర్యదాన్ మహమ్మద్ స్మారక ఉపన్యాసం ఇవ్వనున్నట్లు సమాచారం.

రైతులు, బీసీలు, సామాన్యుల కోసం కార్యక్రమాలు

తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సాధారణ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అవార్డు జ్యూరీ పరిగణనలోకి తీసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధత వంటి అంశాలను కూడా ఎంపికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది

(మిగతా 2వ పేజీలో..)

## మోదీతో ఆల్ట్‌మన్, డారియో ఫొటోను ఎడిట్ చేసిన మేటా ఏఐ చీఫ్.. ఆపై డిలీట్

ఇంటర్నెట్ డెస్క్: మేటా ఏఐ చీఫ్ అలెగ్జాండర్ వాంగ్ తాజాగా ఓ ఫొటోను షేర్ చేసి ఆపై డిలీట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల భారత్‌లో జరిగిన ఏఐ సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీ అమెరికా ఏఐ సంస్థల సీఈఓలు ఉన్న చిత్రం అది. మ్యూజ్ ఏఐ సాయంతో ఆ ఫొటోను అలెగ్జాండర్ వాంగ్ ఎడిట్ చేశారు. ఎడమొహంపెడమొహంగా ఉన్న ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ ఏఐ సీఈఓల మధ్య మ్యూజ్ మాస్కట్‌ను జోడించి ఈ ఫొటోను షేర్ చేశారు. ఇరు ఏఐ సంస్థల సీఈఓల మధ్య సయోధ్య కుదర్చినట్టు సెటైరికల్‌గా ఈ పోస్టు చేశారు. ఆ తరువాత డిలీట్ చేశారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ సమయంలో ఓపెన్ ఏఐ సీఈఓ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో ప్రధాని మోదీతో కలిసి పొటో దిగేందుకు నిలబడ్డారు. అది గ్రూప్ ఫొటో కావడంతో అందరూ కలిసి చేతులు కలిపి నిలబడాల్సి ఉంది. అయితే, వాణిజ్యపరంగా ప్రత్యర్థులైన డారియో, ఆల్ట్‌మన్‌లు పక్కపక్కనే ఉన్నప్పటికీ చేతులు కలిపి ఫొటోకు ఫోజులిచ్చేందుకు నిరాకరించారు. దీంతో, ఈ ఉదంతం అప్పట్లో వైరల్‌గా మారింది.



## ఒక వికెట్ పడింది, త్వరలో మరికొన్ని వికెట్లు .. దానం అనర్హతపై కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ట్వీట్ చేశారు. ఒక వికెట్ పడింది. త్వరలో మరికొన్ని వికెట్లు పడుతాయని జోస్యం చెప్పారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి గెలుపొందిన తరువాత కాంగ్రెస్‌లో చేరడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే హైకోర్టులో కేసు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం దానంపై అనర్హత వేయాలని కోర్టును కోరారు. దాదాపు రెండు సంవత్సరాల వరకు ఇరువాదనలు విన్న హైకోర్టు రెండు రోజుల క్రితం దానం నాగేందర్‌పై అనర్హత వేసింది. అనర్హత చెల్లదని సుప్రీంకోర్టులో దానం నాగేందర్ పిటిషన్ వేయగా గురువారం పిటిషన్‌ను పరిశీలించింది. ఈ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించడంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగనుంది.

## ఎన్నికల సంఘం యాప్‌పై మరోసారి వివాదం.. ఓటు హక్కులు హరించివేస్తున్నారని శశి థరూర్ ఫైర్



ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్‌పై మళ్లీ తీవ్ర వివాదం చెలరేగింది. కొత్త ఓటర్ల చేరిక, పేర్ల తొలగింపు వంటి నిర్ణయాలు ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్థాయిలోనే జరుగుతున్నాయని, మిగతా ఇద్దరు కమిషనర్లకు సమాచారం కూడా అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆ సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గోవాలో జరిగిన ఘటనే ఈ వివాదానికి కారణం. ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో కొన్ని పేర్లపై సాఫ్ట్‌వేర్ అభ్యంతరాలు చూపింది. క్షేత్రస్థాయిలో సరిగ్గా పరిశీలించిన తర్వాత 97

(మిగతా 2వ పేజీలో..)

## జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి: రాహుల్ గాంధీ డిమాండ్

**ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రెస్ మీట్**

**మోదీ, అమిత్ షాలు 'ఓట్ల దొంగతనం' చేస్తున్నారని సంచలన ఆరోపణ**

**సీఈసీ వెంటనే రాజీనామా చేసి, అపూర్వంగా మారాలని డిమాండ్**

**ఈసీలో అంతర్గత విభేదాల వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు**

**ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టీకరణ**



లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఒక "దేశద్రోహి" అని, ఆయన దేశానికి

(మిగతా 2వ పేజీలో..)

## 'కల్కి 2898 ఏడీ'కి జాతీయ అవార్డులు.. ఆసక్తికర విషయాలు పంచుకున్న నాగ్ అశ్విన్

'కల్కి 2898 ఏడీ' సినిమాకు రెండు జాతీయ అవార్డులు రావడంపై దర్శకుడు నాగ్ అశ్విన్ ఆనందం వ్యక్తం చేశారు. భారీ స్థాయిలో ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించడంతో పాటు.. దాన్ని ప్రేక్షకులకు భావోద్వేగంగా దగ్గర చేయగలిగామని అన్నారు. ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి 'బెస్ట్ ఫిల్మ్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్', 'బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్' విభాగాల్లో జాతీయ అవార్డులు దక్కాయి. దీనిపై నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. "ఇంత భారీ ప్రపంచాన్ని సృష్టించడం సాంకేతికంగా, నిర్వహణ పరంగా పెద్ద సవాలు. ఆ ప్రపంచాన్ని

(మిగతా 2వ పేజీలో..)



## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది: హరీశ్ రావు

**తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు**

**ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ**

**ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య**



తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు

(మిగతా 2వ పేజీలో..)

## సీఎం విజయ్ లండన్ పర్యటన.. 'రుతుస్రావం' ప్రచారాన్ని ఖండించిన మంత్రి కీర్తన

**సీఎం లండన్ పర్యటనకు మంత్రి కీర్తన గైర్హాజరుపై వివాదం**

**శస్త్రచికిత్స కారణంగానే పర్యటనకు దూరంగా ఉన్నట్లు వెల్లడి**

**మహిళల ఆరోగ్యంపై చౌకబారు విమర్శలను ఖండించిన టీవీకే నేతలు**



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ లండన్ పర్యటనకు తాను గైర్హాజరు కావడంపై చెలరేగిన వివాదంపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. కీర్తన స్పష్టత ఇచ్చారు. ఒక చిన్న వైద్య ప్రక్రియ కారణంగానే తాను పర్యటనకు

(మిగతా 2వ పేజీలో..)

## కాక్రోచ్ పార్టీ 48 గంటల అల్టిమేటం.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెరుగుతున్న ఒత్తిడి

**ఈసీలో విభేదాల వ్యవహారంతో రాజకీయ దుమారం**

**రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరిక**

**రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్**

**ఇప్పటికే విపక్షాల విమర్శల నేపథ్యంలో పెరిగిన ప్రాధాన్యం**

కేంద్ర ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాల వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది.

(మిగతా 2వ పేజీలో..)



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### చెత్త నిర్వహణలో మార్పు.. పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది

పట్టణాలు, గ్రామాలు వేగంగా విస్తరిస్తున్న కొద్దీ చెత్త సమస్య కూడా అంతే వేగంగా పెరుగుతోంది. జనాభా పెరుగుదల, వినియోగ సంస్కృతి, ప్లాస్టిక్ వినియోగం, ప్యాకేజింగ్ పదార్థాల పెరుగుదల కారణంగా ప్రతిరోజూ భారీగా వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. కానీ వాటిని సక్రమంగా సేకరించడం, వేరు చేయడం, శుద్ధి చేయడం, పునర్వినియోగం చేయడం వంటి ప్రక్రియలు చాలా ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఫలితంగా రోడ్ల పక్కన చెత్త కుప్పలు, కాలువల్లో వ్యర్థాలు, ఖాళీ స్థలాల్లో చెత్త పారబోయడం సాధారణ దృశ్యాలుగా మారుతున్నాయి.

పరిశుభ్రత అనేది కేవలం అందానికి సంబంధించిన విషయం కాదు. అది ప్రజారోగ్యంతో నేరుగా ముడిపడి ఉంటుంది. చెత్త సకాలంలో తొలగించకపోతే దోమలు, ఈగలు, ఇతర కీటకాలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోతే వర్షాకాలంలో నీటి పారుదల సమస్యలు మరింత తీవ్రమవుతాయి. చెత్తను బహిరంగంగా కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుంది. అంటే చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యానికీ ముప్పుగా మారుతుంది.

ఇంటి నుంచే మార్పు మొదలు కావాలి

చెత్త సమస్యను పూర్తిగా అధికార యంత్రాంగం బాధ్యతగా చూడటం సరైంది కాదు. ప్రతి ఇంటి నుంచే మార్పు ప్రారంభం కావాలి. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడం వంటి చిన్న చర్యలే పెద్ద మార్పుకు దారితీస్తాయి. వంటింటి వ్యర్థాలను కంపోస్టింగ్ ద్వారా ఎరువుగా మార్చుకోవచ్చు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పునర్వినియోగించగల వస్తువులను ఉపయోగించడం ద్వారా చెత్త పరిమాణాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

ఇది ఒకరోజు చేయాల్సిన కార్యక్రమం కాదు. అలవాటుగా మారాల్సిన జీవన విధానం. ఇంట్లో చెత్తను వేరు చేసి బయటకు ఇచ్చే అలవాటు పెరిగితే మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు కూడా వ్యర్థాల నిర్వహణ సులభమవుతుంది.

సేకరణలోనే కాదు.. శుద్ధిలోనూ నాణ్యత అవసరం

చెత్తను సేకరించి ఒక చోట పడేయడం మాత్రమే వ్యర్థ నిర్వహణ కాదు. సేకరించిన తర్వాత దాని శాస్త్రీయ నిర్వహణ అత్యవసరం. తడి వ్యర్థాలతో కంపోస్ట్, పొడి వ్యర్థాల్లో పునర్వినియోగ పదార్థాలను వేరు చేయడం, మిగిలిన వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించడం వంటి చర్యలు చేపట్టాలి.

ప్రతి పట్టణంలో రోజువారీ చెత్త ఉత్పత్తి ఎంత? దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యం ఎంత? ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులు ఎంతవరకు పనిచేస్తున్నాయి? అనే అంశాలపై స్థానిక సంస్థలు ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలి. కేవలం వాహనాలతో చెత్త తరలించడం కాకుండా చివరి దశ వరకు పర్యవేక్షణ ఉండాలి.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు అవసరం

ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెద్ద సవాలుగా మారుతున్నాయి. ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత. దుకాణాలకు వెళ్లేటప్పుడు బట్ట సంచులు తీసుకెళ్లడం, నీటి సీసాలను పదేపదే వినియోగించడం, అధిక ప్యాకేజింగ్ ఉన్న వస్తువుల వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు చిన్నవిగా కనిపించినా ప్రభావం పెద్దదే.

అదే సమయంలో ప్రత్యామ్నాయ ప్యాకేజింగ్ పదార్థాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత వ్యాపార సంస్థలపై కూడా ఉంది. వినియోగదారులకు ఎంపికలు ఉన్నప్పుడే మార్పు వేగంగా జరుగుతుంది.

పాఠశాలల నుంచే అవగాహన

పరిశుభ్రతపై అవగాహన చిన్ననాటి నుంచే పెంచాలి. పాఠశాలల్లో చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, నీటి సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించాలి. విద్యార్థులు నేర్చుకున్న అలవాట్లు కుటుంబాలకు కూడా చేరతాయి. పాఠశాల స్థాయిలో చిన్నచిన్న కార్యక్రమాల ద్వారా పెద్ద సామాజిక మార్పుకు పునాది వేయవచ్చు.

ప్రజల భాగస్వామ్యమే విజయానికి కీలకం

పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రభుత్వ సంస్థలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం లేకుండా పూర్తి ఫలితం సాధ్యం కాదు. అదే సమయంలో ప్రజలకు బాధ్యతలు చెప్పే ముందు స్థానిక సంస్థలు కూడా తమ సేవలను సమర్థవంతంగా అందించాలి. చెత్త సేకరణ సమయాలు, ప్రత్యేక సేకరణ కేంద్రాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వంటి అంశాల్లో స్పష్టత ఉండాలి.

రోడ్డుపై చెత్త వేయకూడదని చెప్పడం ఎంత ముఖ్యమో.. చెత్త వేయడానికి సరైన సదుపాయాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. జరిమానాల కంటే అవగాహన, సదుపాయాలు, నిరంతర పర్యవేక్షణ కలగలిసి పనిచేసినప్పుడే మంచి ఫలితం వస్తుంది. పరిశుభ్రత అనేది ఒక శాఖ పని కాదు.. సమాజం మొత్తం బాధ్యత. ఇంటి ముందు మాత్రమే కాదు, మన వీధి, మన కాలనీ, మన గ్రామం, మన పట్టణం పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆలోచించినప్పుడే నిజమైన మార్పు వస్తుంది. చెత్తను సమస్యగా చూసే దశ నుంచి.. వ్యర్థాన్ని వనరుగా మార్చే దిశగా అడుగులు వేయాల్సిన సమయం వచ్చింది. పరిశుభ్రమైన సమాజమే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బలమైన పునాది.

## ఎన్నికల సంఘం యాప్‌పై మరోసారి వివాదం.. ఓటు హక్కులు హరించివేస్తున్నారని శశి థరూర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

మంది ఓటర్లు అర్హులేనని స్థానిక అధికారులు నిర్ధారించారు. కానీ వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైన రోల్‌బ్యాక్ సౌకర్యం యాప్‌లో లేదు. దీంతో గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఢిల్లీలోని ఎన్నికల సంఘానికి పదేపదే అభ్యర్థనలు పంపారు. అయినా అనుమతి రాకపోవడంతో ఆ పేర్లు జాబితాలోకి రాలేకపోయాయి. యాప్‌పై పూర్తి నియంత్రణ ఢిల్లీ వద్దే ఉందని సమాచారం. ఓటరు జాబితాలో పేరు లేకపోతే కేవలం ఓటు మాత్రమే కాదు... గోవా మెడిక్లెయిమ్ పథకం కింద డయాలసిస్, గుండె శస్త్రచికిత్స, అవయవ మార్పిడి, కీమోథెరపీ వంటి కీలక చికిత్సలకు కూడా అవకాశం దక్కదు. ఈ పథకం రాష్ట్ర ఓటర్లకే పరిమితం కావడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నారని థరూర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియా పోస్టులో ఆయన "ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. పౌరుల ప్రాథమిక హక్కులు, ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ఇలాంటి అమానుష వ్యవస్థను కొనసాగించకూడదు. ఎన్నికల సంఘం వెంటనే క్షమాపణ చెప్పి, ఈ సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయాలి. జరిగిన నష్టాన్ని సరిదిద్దాలి" అని స్పష్టం చేశారు.

## 'కల్కి 2898 ఏడీ'కి జాతీయ అవార్డులు.. ఆసక్తికర విషయాలు పంచుకున్న నాగ్ అశ్విన్

మొదటి పేజీ తరువాయి)

ప్రేక్షకులకు భావోద్వేగంగా చేరువ చేయగలిగాం. సినిమాతో కోట్లాది మంది కనెక్ట్ అయ్యారు. అందులోని ప్రపంచం, పాత్రలను ప్రేమించారు. ఈ రెండు విషయాలను సాధించగలగడం మాకు చాలా ప్రత్యేకం" అని తెలిపారు. 'కల్కి 2898 ఏడీ'కి దక్కిన ప్రొడక్షన్ డిజైన్ అవార్డుపై కూడా ఆయన స్పందించారు. ఇప్పటికే ఉన్న ప్రపంచాన్ని అనుకరించకుండా.. సినిమాకు ప్రత్యేకమైన విజువల్ గుర్తింపు ఉండేలా ప్రయత్నించామని చెప్పారు. ఇకపై కూడా భారతీయ మూలాలతో కూడిన కొత్త తరహా ప్రపంచాలను సృష్టించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. నాగ్ అశ్విన్‌కు జాతీయ అవార్డు దక్కడం ఇదే తొలిసారి కాదు. కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మహానటి' చిత్రానికి 2018లో ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డు వచ్చింది. ఇప్పుడు 'కల్కి 2898 ఏడీ'తో ఆయనకు మరో రెండు అవార్డులు దక్కాయి.

# రేవంత్‌కు 'ఆర్యదాన్' గౌరవం.. బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు ఎంపిక

మొదటి పేజీ తరువాయి)

.రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల వివిధ వేదికలపై చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. రైతులు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

ఇటీవల వైఎస్సార్ అవార్డుల కార్యక్రమానికీ హాజరు

మరోవైపు సెప్టెంబర్ 2న న్యూఢిల్లీలో నిర్వహించిన డా. వైఎస్సార్ అవార్డు-2026 కార్యక్రమానికి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. డా. వైఎస్సార్, డా. కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో కృషి చేస్తున్న ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. తాజాగా కేరళకు చెందిన ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ నుంచి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' పురస్కారానికి ఎంపిక కావడం ద్వారా రేవంత్‌రెడ్డి పేరు మరోసారి జాతీయ స్థాయిలో చర్చకు వచ్చింది. శుక్రవారం నిలంబూరులో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

## జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి: రాహుల్ గాంధీ డిమాండ్

మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రమేయంతో దేశంలో 'ఓట్ల దొంగతనం' జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ ను ఆయన 'పరిరక్షకులే' కాపాడుతున్నారని మండిపడ్డారు. గురువారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ మౌనంగా ఉండదని హెచ్చరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించి గత 10 నెలల్లో ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినా, వాటిని సీఈసీ పట్టించుకోలేదని వచ్చిన మీడియా కథనాలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఎన్నికల సంఘంలో ఈ అంతర్గత విభేదాలే తన ఆరోపణలకు బలమైన ఆధారమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "అబ్‌కీ బార్ 400 పార్" అని, దశాబ్దాల పాటు అధికారంలో ఉంటామని మోదీ, అమిత్ షాలు గతంలో ఎంతో ధీమాగా చెప్పారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యతిరేకత సర్వసాధారణమని, అలాంటిది బీజేపీకి మాత్రం ఎలా వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. "1971 యుద్ధంలో దేశానికి ఘన విజయం అందించిన ఇందిరా గాంధీ వంటి నేత కూడా ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా వ్యతిరేక పవనాలు ఉన్నా, అవి అకస్మాత్తుగా ఎలా మాయమయ్యాయి?" అని రాహుల్ నిలదీశారు. దీనికి కారణం 'ఓట్ల దొంగతనం' జరగడమేనని తమ పార్టీ ఒక నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. "ఓట్లను దొంగిలిస్తే రాజ్యాంగానికి పునాదులే ఉండవు. దొంగిలించబడిన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు చేసే చట్టాలు కూడా చట్టవిరుద్ధమే అవుతాయి. దీనిని 'చట్టాల దొంగతనం' అంటారు. దాని ఫలితంగా సంస్థాగత మార్పులు కూడా అక్రమమే అవుతాయి" అని రాహుల్ వివరించారు. ఈ ప్రక్రియకు బాధ్యులైన మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను దేశద్రోహులుగా అభివర్ణించారు. గతంలో జరిగిన లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దీనిపై మోదీ, షాలపై భవిష్యత్తులో తప్పకుండా విచారణ జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ, "మీరు చేసింది దేశద్రోహంతో సమానం. ఇది రాజ్యాంగంపై, దేశ చట్టాలపై జరిగిన దాడి. ఓటును కాపాడాల్సిన మీరే ఇలా చేశారు. ఇప్పటికైనా రాజీనామా చేసి, దేశ ప్రయోజనాల దృష్ట్యా అప్రూవర్‌గా మారండి" అని హితవు పలికారు. నిజాయతీగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఇద్దరు కమిషనర్లను ఆయన అభినందించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దీనిని నిరూపించడానికి తమ వద్ద తగినంత సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కుట్రకు బాధ్యులైన వారికి ఏదో ఒక రోజు తప్పకుండా శిక్ష పడుతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం గతంలోనే స్పందించింది. కమిషనర్ల మధ్య చర్చలు, అభిప్రాయ భేదాలు పరిపాలనలో సాధారణ ప్రక్రియ అని, తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది. అయినప్పటికీ, రాహుల్ చేసిన తాజా ఆరోపణలతో ఈ వివాదం మరింత ముదిరినట్టయింది.

## మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## సీఎం విజయ్ లండన్ పర్యటన.. 'రుతుస్రావం' ప్రచారాన్ని ఖండించిన మంత్రి కీర్తన

మొదటి పేజీ తరువాయి)

దూరంగా ఉన్నానని, ఆరోగ్యం అనేది పూర్తిగా వ్యక్తిగత విషయమని ఆమె తేల్చిచెప్పారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు సీఎం విజయ్ లండన్‌లో పెట్టుబడుల ఆకర్షణ కోసం పర్యటించారు. ఈ పర్యటనకు మంత్రి కీర్తన వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది. కీర్తన నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉన్నారని మరో మంత్రి ఆధవ్ అర్జున చెప్పగా, డీఎంకే సానుభూతిపరురాలైన విమర్శకురాలు వైష్ణవి ఆ వ్యాఖ్యలను రుతుస్రావంతో ముడిపెడుతూ ప్రశ్నించారు. ఇది సహజ శారీరక ప్రక్రియ అయితే, దానిని ఒక కారణంగా ఎందుకు చెప్పాలని ఆమె అనడం లైంగిక వివక్ష ఆరోపణలకు దారితీసింది. ఈ వివాదంపై మంత్రి కీర్తన స్వయంగా వివరణ ఇచ్చారు. గతంలో అయిన గాయం కారణంగా అమర్చిన మెడికల్ ఇంప్లాంట్‌తో అసౌకర్యం కలగడంతో, దానిని సర్జరీ ద్వారా తొలగించాలని వైద్యులు సూచించారని తెలిపారు. అయితే, సెప్టెంబర్ 9న హెచ్‌డీ హ్యుందాయ్‌తో కీలక సమావేశం ఉండటంతో సర్జరీని వాయిదా వేసుకున్నానని, ఆ తర్వాత సర్జరీ జరిగిందని, వైద్యులు విశ్రాంతి సూచించారని వెల్లడించారు. ఈ సమయంలోనే లండన్ పర్యటన ఏర్పాట్లను దూరం నుంచే పర్యవేక్షించానని, తన గైర్హాజరుకు వేరే కారణం లేదని స్పష్టం చేశారు. ఆమెకు కాలర్‌బోన్ సర్జరీ జరిగిందని సహచర ఎమ్మెల్యే కనిమొళి సంతోష్ కూడా ధ్రువీకరించారు. "ఒక వ్యక్తి ఆరోగ్యం వ్యక్తిగత విషయం కాబట్టే నేను ఈ విషయాన్ని ముందుగా వెల్లడించలేదు. ప్రజా జీవితంలో ఉన్నవారి పనితీరును విశ్లేషించాలి కానీ, వారి ఆరోగ్యంపై ఊహాగానాలు చేయడం సరికాదు. మహిళలు తమ వ్యక్తిగత గోప్యత, గౌరవం మధ్య ఎంచుకోవాల్సిన పరిస్థితి రాకూడదు" అని కీర్తన తన ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా మంత్రి గైర్హాజరును అనారోగ్యం లేదా ఇతర కారణాలతో చూడకుండా, కేవలం జీవ సంబంధమైన అంశంతో ముడిపెట్టడాన్ని టీవీకే నేతలు "తిరోగమన ఆలోచనా ధోరణి"గా ఖండించారు. తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వివాదం చోటుచేసుకోవడం గమనార్హం.

## కాక్రోచ్ పార్టీ 48 గంటల అల్టిమేటం.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెరుగుతున్న ఒత్తిడి

మొదటి పేజీ తరువాయి)

ఎస్ఐఆర్ సహా ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రచురించింది. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ కథనం పేర్కొంది. దీంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై విపక్షాల విమర్శలు మరింత పెరిగాయి. ఇప్పటికే కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కూడా రంగంలోకి దిగింది. జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అల్టిమేటం ఇచ్చారు. గడువులోగా రాజీనామా చేయకపోతే ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు. ఈ క్రమంలో, సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ తమ డిమాండ్లను వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతో పాటు ఆయనకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలను 2025 నాటి స్థాయికి పునరుద్ధరించాలని కోరారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫైళ్లను సుప్రీంకోర్టు నేతృత్వంలోని కమిటీ అధీనంలో ఉంచాలన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్రస్తుత చట్టాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. గతంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారం, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా కూడా సీజేపీ ఇలాంటి ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి వారి డిమాండ్లను నెరవేర్చింది. తాజాగా ఎన్నికల సంఘంపై ఆందోళనకు పిలుపునివ్వడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇక పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు ముందు ఉన్న ఓటర్ల జాబితా ఆధారంగా పశ్చిమ బెంగాల్‌లో తాజా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా విపక్షాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కూడా సీఈసీ రాజీనామా డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర నేతలు ఎన్నికల సంఘం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ప్రక్రియపై ఇప్పటికే తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలకు తాజా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం బలం చేకూర్చుతోందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా స్పందించారు. జ్ఞానేశ్ కుమార్ హయాంలో ఇకపై ఎన్నికలు నిర్వహించకూడదనిడిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంలోనే నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదైనట్లు వచ్చిన సమాచారం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మరింత తీవ్రంగా స్పందించారు. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతో పాటు జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లు నమోదు చేసిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు, రాతపూర్వక అభిప్రాయాలు నమోదు కావడం అంతర్గత చర్చల్లో సాధారణమేనని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌తో పాటు గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం తెలిపింది. ఇదే సమయంలో బీజేప విపక్షాల విమర్శలను తప్పుబట్టింది. ఎన్నికల కమిషనర్ల మధ్య చర్చలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమేనని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ విషయంలో తుది నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని చెప్పారు. దీంతో సీఈసీపై విపక్షాల విమర్శలు ఒకవైపు, ఎన్నికల సంఘం వివరణ మరోవైపు కొనసాగుతున్నాయి. ఇప్పుడు సీజేపీ ఇచ్చిన 48 గంటల గడువు ఈ వ్యవహారానికి కొత్త మలుపు తీసుకొచ్చింది. గడువు పూర్తయ్యాక సీజేపీ ఎలాంటి కార్యాచరణ చేపడుతుంది? ఇతర విపక్ష పార్టీలు దానికి మద్దతు ఇస్తాయా? దేశవ్యాప్త ఆందోళనలకు ఈ అంశం దారితీస్తుందా? అనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఉర్దూ మీడియం హైస్కూల్‌కు లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు







**రూ.23 వేల విలువైన సౌండ్ సిస్టమ్ అందజేత.. విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్ పంపిణీ**

**పోతంగల్/సెప్టెంబర్ 24/(జన సంఘర్షణ)**

పోతంగల్: విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటునందించడంతో పాటు సమాజ సేవలో భాగస్వాములవుతూ పోతంగల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉర్దూ మీడియం హైస్కూల్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అవసరాలను గుర్తించి సుమారు రూ.23 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు సుధం నవీన్, సుధం లింగురం ఈ కార్యక్రమంలో పాల్గొనగా, సౌండ్ సిస్టమ్‌ను లయన్ సుధం నవీన్ దాతగా అందించారు.అదేవిధంగా పాఠశాలలో విధులు! నిర్వహిస్తున్న లయన్ రవీంద్ర బాబు విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.5 వేల విలువైన పెన్సిల్స్, పెన్నులు, స్కేల్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారిలో చదువుపై మరింత ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను! పలువురు అభినందించారు. విద్య, వైద్యం, సామాజిక సేవ వంటి రంగాల్లో తమవంతు సహకారం అందిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.కార్యక్రమంలో ఉర్దూ మీడియం హైస్కూల్ హెడ్‌మాస్టర్ విమల, పోతంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్. లక్ష్మణ్, సెక్రటరీ ఎం. నాగయ్య, ట్రెజరర్ పి. అనిల్ కుమార్, లయన్ +జు పల్లెంపాటి శ్రీధర్, జోన్ చైర్మన్ సితలె రమేష్, భవానీ క్లబ్ బోధన్ అధ్యక్షురాలు ఉమా పార్వతి, లయన్ రవీంద్ర బాబు, లయన్స్ క్లబ్ సభ్యులు సుధం నవీన్, బండారి హన్మండ్లు సెట్, సంతోష్ పటేల్, చిత్తరి శ్రీనివాస్ సెట్, రత్నాకర్, గంధపు సాగర్‌తో పాటు విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**ఆపదలో ఉన్నవారికి అండగా సితలె రమేష్!**

ఈ సందర్భంగా పోతంగల్ వార్డు నంబర్ పంచ్ రెడ్డి అనిల్ మాట్లాడుతూ.. సితలె రమేష్ ఎన్నో సేవా కార్యక్రమాలను తన స్నేహితులతో కలిసి నిర్వహిస్తూ, ఆపదలో ఉన్నవారికి 'నేనున్నాను' అంటూ ముందుకు వస్తున్నారని తెలిపారు. తనకు తోచిన మేరకు ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు.ముఖ్యంగా ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం అవసరమైన పరిస్థితుల్లో ఉంటే, వారికి మెరుగైన వైద్యం అందేలా తన స్నేహితుల సహకారంతో ముందుకు తీసుకెళ్లేందుకు సితలె రమేష్ కృషి చేస్తారని అనిల్ తెలిపారు. అవసరమైన సమాచారాన్ని వాట్సాప్ స్టేటస్ ద్వారా అందరికీ తెలియజేసి, సహాయం చేయగల వారిని ఒకచోట చేర్చి బాధితులకు అండగా నిలిచే ప్రయత్నం చేస్తారని పేర్కొన్నారు.సేవ చేయడం ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేరకు ఇతరులకు అండగా నిలిస్తే ఎన్నో కుటుంబాలకు భరోసా కలుగుతుందని సితలె రమేష్ తన సేవా కార్యక్రమాల ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారని అనిల్ అన్నారు.విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందించడం నుంచి ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం వరకు సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తోడ్పాటు అందిస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది.





- **భారత ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదినం 25 సంవత్సరాల పాలన పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంకర్షణ)**


భారత ప్రధానమంత్రి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారి 76 వ జన్మదినం వారి 25 సంవత్సరాల పరిపాలన పురస్కరించుకుని మెదక్ పట్టణం లోని ఫతేనగర్ ప్రాథమికోన్నత పాఠశాల లో స్థానిక 21 వ వార్డ్ కౌన్సిలర్ పబ్బరాజమణి లక్ష్మణ్ గారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన,చిత్రలేఖన పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందచేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బీజేపీ మెదక్ జిల్లామాజీ అధ్యక్షుడు జగిత్యాల జిల్లా ఇంచార్జ్ గడ్డం శ్రీనివాస్ పాల్గొని నరేంద్ర మోదీ గారి వల్ల మన దేశం అభివృద్ధి చెందుతుందని వారి కల సాకారం అయ్యేలా వికసిత భారత్ కై అందరు సహరించాలని కోరారు.అలాగే వారి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి గురించి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఇట్టి కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు అశోక్ మరియు వారి ఉపాద్యాయ బృందం తో పాటు 22 వ వార్డ్ కౌన్సిలర్ గౌస్ ఖురేషి ,బిజెపి నాయకులు బెండల స్వామి, నాయిని ప్రసాద్,రంజిత్,ఎం ఎల్ ఎన్ రెడ్డి,గడ్డం కాశీనాథ్, నల్లాల విజయ్,బజ్జూరి భిక్షపతి,నాగరాజు,మధు, ఆంజనేయులు, అంకం శ్రీనివాస్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంలో అపశృతి.

**కాలువలో పడిపోయిన కమిండ్ల గణేష్..**

**పోలీసులు,ఫైర్ సిబ్బందితో గాలింపు చర్యలు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ)**





మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది.బుధవారం నిమజ్జనం సందర్భంగా గురువారం తెల్లవారు.జామున 3 గంటల సమయంలో కమిండ్ల గణేష్ ప్రమాదవశాత్తు హల్దీ ప్రాజెక్టు కాలువలో గల్లంతు కావడంతో విషయం తెలుసుకున్న పోలీసులు,ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.ఫైర్ సిబ్బంది,గజ ఈతగాళ్ల సహాయంతో కాలువలో గణేష్ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.కాగా గణేష్ ఇటీవలే తన చెల్లెలి వివాహాన్ని జరిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.నిమజ్జన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని 'బడి' బాట!

**చెరువు అలుగు పారడంతో రాకపోకలకు అంతరాయం.. నడుములోతు నీటిలోంచి విద్యార్థులు, గ్రామస్థుల రాకపోకలు**

**కామారెడ్డి/సెప్టెంబర్24/(జన సంఘర్షణ)**



కామారెడ్డి: కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలం కాస్లాబాద్‌లో చెరువు నిండి అలుగు పారుతుండటంతో కుబ్యా నాయక్ జీపీ పరిధిలోని దుబ్బ తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వేరే మార్గం లేకపోవడంతో విద్యార్థులు, గ్రామస్థులు నడుములోతు నీటిలోంచి ప్రాణాలను పణంగా పెట్టి రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ నీటిని దాటుకుంటూ వెళ్లాల్సి రావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వర్షాలు కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి ప్రవాహం పెరిగిన సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, విద్యార్థులు, గ్రామస్థుల భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.దుబ్బ తండాకు రాకపోకలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, వర్షాకాలంలో విద్యార్థులు, గ్రామస్థులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు.

## పోతంగల్‌లో 'చేయూత' పెన్షన్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన

**అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పెన్షన్ అందేలా చర్యలు : ఎంపీడీవో చందర్ నాయక్**

**పోతంగల్, సెప్టెంబర్ 24 (జనసంఘర్షణ):**



పోతంగల్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'చేయూత' పెన్షన్ పథకం నూతన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన (వెరిఫికేషన్) కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) చందర్ నాయక్ పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారుల దరఖాస్తులు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో చందర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా పెన్షన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.దరఖాస్తుదారుల వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు.అర్హత కలిగిన లబ్ధిదారులు ఎవరూ జాబితా నుంచి తప్పిపోకుండా క్షేత్రస్థాయి రికార్డులను పక్కాగా నమోదు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి, సంబంధిత సిబ్బందికి ఎంపీడీవో సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తుల పరిశీలనతో పాటు ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందాలి : సర్పంచ్ సంధ్య

గ్రామ సర్పంచ్ సంధ్య మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. అర్హత కలిగిన పేద కుటుంబాలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో చందర్ నాయక్ సూచించారు.

## అనారోగ్యంతో మరణించిన ఎంకమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత.

**కాంగ్రెస్ పార్టీ నాయకుడు,లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మీనాక్షి మోహన్ నాయక్.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ)**



మెదక్ జిల్లా హవేలీ ఘన్ పూర్ మండలం కూచన్ పల్లి గ్రామానికి చెందిన ఎరుకల ఎంకమ్మ అనారోగ్య కారణంతో మరణించారు.వారి కుటుంబ పరిస్థితిని గమనించి ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ గారికి తెలియజేయగా వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలోబీసీ సంక్షేమ సంగం మెదక్ జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శేరి మహేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ దేవగౌడ్ ,వెంకట్ రెడ్డి బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడురవి,యాదగౌడ్, సీనియర్ జర్నలిస్ట్ రాద్వ లక్ష్మణ్ ,సురేష్, పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ యూత్ వినాయకుని దర్శించుకుని అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంకర్షణ)**

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని విజ్ఞాన్ యూత్ వినాయకుని దర్శించుకున్న అన్నదానం కార్యక్రమం పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు వైస్ చైర్ పర్సన్ పోచమ్మ నవనీత గణేష్,కౌన్సిలర్స్ పుట్టి సందీప్,డాకి శ్యామల స్వామి, కో ఆప్షన్ మెంబర్ చింతల రాధా భవాని యాదిగిరి, పట్టణ అధ్యక్షుడు చింతల స్వప్న స్వామి,యూత్ నాయకులు విరాట్,సాయి,సుధీర్ గౌడ్,గణేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# రెడ్ క్రాస్ ఎన్నికల నామినేషన్ల ముగింపు.

**23 మంది అభ్యర్థుల పత్రాల స్వీకరణ.**

**నేడు స్ర్కూట్నీ,రేపు ఉపసంహరణలు.**

**అక్టోబర్ 4న ఎన్నికలు రెడ్ క్రాస్ ఎన్నికల అధికారి ఆర్డీఓ రమాదేవి.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ)**



మెదక్ జిల్లాలో రెడ్ క్రాస్ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది.గురువారం 23 మంది అభ్యర్థులు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా పత్రాలను దాఖలు చేశారు.వీరిలో రామాయంపేట నుంచి జిల్లా పాస్టర్ చైర్మన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్,వంగరి కైలాస్,మద్దెల సత్యం,డి.జీ శ్రీనివాస శర్మ,దేమే యాదగిరి లతో పాటు స్టేట్ మేనేజ్మెంట్ కమిటీ పాస్టర్ మెంబర్ సింగం శ్రీనివాసరావులుఉన్నారు.ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న ఆర్డీవో రమాదేవి నామినేషన్ పత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని మొత్తం 23 మంది దాఖలు చేయగా శుక్రవారం స్ర్కూట్ ని శనివారం ఉపసంహరణలు ఉంటాయన్నారు.చివరగా అక్టోబర్ 4న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ)**



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మెదక్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొత్తం 23 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి,ఆర్డీవో డాక్టర్.రమాదేవి తెలిపారు.నామినేషన్ల పరిశీలన 25.09.2026 తేదీన నిర్వహించబడుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు 26.09.2026 తేదీన అవకాశం కల్పించడంతో పాటు, అదే రోజు తుది నామినేషన్ల జాబితానుప్రచురించనున్నారు.మెదక్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ 04.10.2026 తేదీన నిర్వహించబడుతుంది.ఎన్నికల ప్రక్రియను సంబంధిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు ఎన్నికల అధికారి డా. రమాదేవి తెలిపారు.

# తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్లమండలం , సెప్టెంబర్ 24(జనసంఘర్షణ):**



మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం సూచించారు. వర్షాల తీవ్రత దృష్ట్యా అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని, ప్రయాణాల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు అవసరం లేకుండా బయటకు రాకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, చెట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. వర్షాల సమయంలో వాగులు, వంకలు, కాలువలు దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ప్రజలకు ఏదైనా అత్యవసర సమస్య ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామపంచాయతీ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటారని సర్పంచ్ తెలిపారు. వర్షాలు తగ్గే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సురక్షితంగా ఉండాలని పూజారి సామ్రాజ్యం విజ్ఞప్తి చేశారు.

# ఝాన్సీ లింగాపూర్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం వేగవంతం.


**ఝాన్సీలింగాపూర్ గ్రామ సర్పంచ్ మానెగల రామకృష్ణయ్య తెలిపారు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంకర్షణ)**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుట్టూ 5 లక్షల రూపాయలతో నిర్మించే ప్రహరీ గోడ దసరా లోపు పూర్తి చేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ రామకృష్ణయ్య గురువారం తెలిపారు. పనులు చురుకుగా జరుగుతున్నట్టు ఆయన తెలిపారు. గ్రామంలో మహిళా భవనం, సిసి రోడ్లు పండగ లోపు పూర్తి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం బాలిక మృతి.




**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24(జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం జంగారాయి గ్రామంలో బొమ్మరైన కృష్ణ తల్లి లావణ్య వాళ్లకి ముగ్గురు కూతుళ్లురు మూడవ కూతురు కీర్తన యూకేజీ వయసు 7 సంవత్సరాలు చిన్న శంకరంపేట మండలం సరస్వతి స్కూల్లో యూకేజీ చదువుతుండగా రాను పోను బస్సు సౌకర్యం ఉంది.కాబట్టి చాలామంది పిల్లలు పోతున్నారు.తిరిగి వస్తున్న సమయంలో నాలుగు గంటల పది నిమిషాలకు నలుగురు పిల్లలు ఒకరిని ఒకరు బస్సు దిగి ముందుకు నడుస్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంతో అందులో ఉన్న క్లీనర్ ఆపమని చెప్పగా ఆయనవినిపించుకోకపోవడంతో అమ్మాయి ముందు బాగాన బంపర్ కు తగిలి వెనుక టైర్ల కింద పడి తల పగిలి ప్రాణాపాయలతో ఉన్న అమ్మాయిని అకస్మాత్తుగా 108 లో తీసుకపోతుండగా తూప్రాన్ ఆస్పటల్ పోయేలోపు ఆమె ప్రాణాలు విడిచిందని డాక్టర్లు నిరుధారణ చేశారు.

# క్రైస్తవ సమాజ సమస్యల పై పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం





**భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా,భద్రాచలం నియోజకవర్గం, సెప్టెంబర్ 24(జనసంఘర్షణ):**

దుమ్ముగూడెం మండలం, మారాయిగూడెం గ్రామంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు ఎమ్మెల్యే కి ఘనంగా, ఆత్మీయంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా క్రైస్తవ సమాజానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై పాస్టర్లతో ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు ఆత్మీయంగా చర్చించారు. ముఖ్యంగా ప్రార్థనా మందిరాలకు సంబంధించిన సమస్యలు, క్రైస్తవ సమాజ సంక్షేమం, పాస్టర్ల సమస్యలు, విద్యా--వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు వంటి అంశాలపై చర్చ జరిగింది.అలాగే ప్రజలందరికీ సమానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు, పాస్టర్లు, క్రైస్తవ సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

# త్వరలో మెదక్ లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ)**

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్లో భాగంగా మెదక్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగావ్యవహరిస్తోంది.తెలంగాణ ప్రభుత్వం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి లభించిన విశేష స్పందనతో మధిర,మంథని, మంచిర్యాల,కరీంనగర్ ప్రాంతాల్లో కూడా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఈ విజయవంతమైన కార్యక్రమాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా మెదక్ లో మరో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సిద్ధం చేశారు.మెదక్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలలోని దాదాపు 11 మండలాల పరిధిలో 395 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 29,183 మంది విద్యార్థులకు ప్రతిరోజూ రుచికరమైన, పరిశుభ్రమైన,పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందిస్తారు.విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సహకారంతో రూపొందించిన మెనూ.

మెనూ

ఇడ్లీ - సాంబార్

పూరి - ఆలు కుర్మా

దోష - చెట్నీ

ఉప్మా - చెట్నీ

మిల్లెట్ ఇడ్లీ సాంబార్

బోండా - చట్నీ

ప్రతిరోజు ఒక వెరైటీ ఉంటుంది.

విద్యార్థులకు రోజు విడిచి రోజు పాలు కూడా అందిస్తారు.



విద్యార్థులకు ఉదయం పూట పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడేలా కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయనున్నారు.విద్యార్థులు ఆకలిపాఠశాలకు రాకుండా, ఆరోగ్యకరమైన అల్పాహారంతో ఉత్సాహంగా చదువుపై దృష్టి సారించేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

# ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి : (ఏవో) నిషితమేడం

**ఈనెల 30 చివరి తేదీ.. నమోదు చేసుకోని రైతులకు వివిధ ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ ప్రయోజనాల్లో ఇబ్బందులు**

**పోతంగల్, సెప్టెంబర్ 24 (జనసంఘర్షణ):**

పోతంగల్ మండలంలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏవో) నిషిత సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకునేందుకు సెప్టెంబర్ 30, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు.ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న వివిధ రైతు సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఎఫ్‌ఎఫ్‌ఎస్ (ఖీఖీూ) ఎరువుల యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు చేసుకునే అవకాశం ఉండదని తెలిపారు. కావున ఇంకా నమోదు చేసుకోని రైతులు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.రైతుల భూమి, రైతుకు సంబంధించిన వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసి, ప్రభుత్వ వ్యవస్థలో వాటిని ధ్రువీకరించడంతో పాటు వివిధ రైతు సంక్షేమ కార్యక్రమాలకు అనుసంధానం చేయడం జరుగుతుందని ఏఈఓ నిషిత తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ ప్రయోజనాలకు రైతు రిజిస్ట్రీ వివరాలు కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు.ముఖ్యంగా డిసెంబర్ 1, 2025 నుంచి ఆగస్టు 2026 మధ్యలో పట్టా పాస్‌బుక్ పొందిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

నమోదు ఎక్కడ చేసుకోవాలి?

రైతులు తమ సమీపంలోని లివ్యవసాయ విస్తరణ అధికారి (ఏవో)లిను సంప్రదించడంతో పాటు మీ సేవ కేంద్రంలో కూడా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.

అవసరమైన పత్రాలు

1. పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్
2. ఆధార్ కార్డు జిరాక్స్
3. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్

రైతులకు ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ఇతర వ్యవసాయ ప్రయోజనాలకు సంబంధించిన సమాచారం తమ కార్యాలయానికి అందిన వెంటనే రైతులకు చేరవేస్తామని ఏఓ నిషిత తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రైతు వేదికకు లేదా వ్యవసాయ కార్యాలయానికి వచ్చి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.అలాగే రైతులు తమ ఫోన్ ద్వారా సంప్రదించినా అవసరమైన వివరాలు, వివరణలను అందిస్తామని ఆమె తెలిపారు. పోతంగల్ మండలంలోని రైతులందరూ ఈ సమాచారాన్ని గమనించి, ఇంకా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోని రైతులు సెప్టెంబర్ 30లోపు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఏఓ నిషిత కోరారు.



# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక




# వినాయక నిమజ్జనం బందోబస్తుపై సిబ్బందికి బ్రీఫింగ్.





**నిమజ్జన వాహనాలపై ప్రత్యేక పర్యవేక్షణ.**

**వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు.**

**మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ)**

వినాయక నిమజ్జనం సందర్భంగా మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్ హాల్‌లో బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీసు అధికారులు,సిబ్బందికి గురువారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు,రద్దీ ప్రాంతాలు, చెరువుల వద్ద నిరంతరం నిఘా ఉంచాలనిఆదేశించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, నిమజ్జన వాహనాలు నిర్దేశించిన మార్గాల్లోనే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జన వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకుండా పర్యవేక్షించాలని సూచించారు. చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ అన్నారు. కొంటూర్ చెరువు వద్ద గజ ఈతగాళ్లు, అత్యవసర స్పందనా సిబ్బంది, ఫైర్ సిబ్బంది పూర్తి అప్రమత్తంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధులు నిర్వహించే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డియస్పి లు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు సందీప్ రెడ్డి, మహేష్, కృష్ణ మూర్తి, రేణుక, శైలందర్, ఎస్ ఐ లు సిబ్బంది ఉన్నారు.

# ఆట గెలుపు ఓటమిని నేర్పిస్తుంది.






**క్రీడలు అంటేనే పోటీ తత్వం.**

**ఆటలను ఆసరాగా తీసుకొని లక్ష్యంను,తల్లిదండ్రులను, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలి.**

**డిఆర్డిఏ పి డి శ్రీనివాసరావు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లాను టూరిస్ట్ హబ్ గా చేయడమే లక్ష్యం..మెదక్ జిల్లా విద్యాధికారి రాజు అన్నారు ఆట గెలుపు ఓటమిని నేర్పిస్తుందని క్రీడలు అంటేనే పోటీ తత్వం, ఆటలను ఆసరాగా తీసుకొని లక్ష్యం ను తల్లిదండ్రులను ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని డి ఆర్ డి ఏపి డి శ్రీనివాస్ అన్నారు. గురువారం మెదక్ వెస్లీ గ్రౌండ్లో నిర్వహిస్తున్న బాలికల అండర్ 14, 17 జిల్లాస్థాయి కబడ్డీ క్రీడ పోటీలకు మెదక్ జిల్లా విద్యాధికారి రాజు, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగాహాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క క్రీడాకారుడు మండల స్థాయి నుండి జిల్లా జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు. చాలామంది విద్యార్థులు చదివి బానిస అవుతున్నారని చదువులోతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. పాఠశాలలో ఎక్కువగా విద్యార్థులు ఇష్టపడేవారు వ్యాయామ ఉపాధ్యాయులు అని ఆయన అన్నారు. మెదక్ జిల్లా విద్యాధికారి రాజు మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో వాలీబాల్, ఖోఖో,కబడ్డీ, క్రీడ పోటీలు ఇలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తున్న ఏస్ జి ఎఫ్ సెక్రటరీ నాగరాజుకు, వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలుపొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. వరల్డ్ టూరిజం డే ను ఆదివారం 27వ తేదీన విజయవంతం చేయాలని మెదక్ జిల్లాను టూరిస్ట్ అబ్బుగా చేయడమే లక్ష్యమని ఆయన అన్నారు. వరల్డ్ టూరిజం లేని పురస్కరించుకొని ప్రతి ఒక్క వ్యాయమ ఉపాధ్యయయులు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ సెక్రటరీ నాగరాజు, డివైఎస్ఓ రమేష్, పేటటిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, టిజిపేట అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సీనియర్ పిడి మాధవరెడ్డి,శ్రీకాంత్ గౌడ్,రవి,లతీఫా జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఆర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి.






**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ)**

జిల్లాలో ట్రిపుల్ ఆర్ భూములను పకడ్బందీగా జాయింట్ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో డిఆర్ఓ, ఆర్డిఓ, ఏడి సర్వే, తహసిల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ట్రిపుల్ ఆర్ సంబంధించిన భూములను ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు కలసి జాయింట్ సర్వే నిర్వహించాలని, రెవెన్యూ, ఫారెస్ట్ బౌండరీలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ,ట్రిపుల్ భూముల్లో రీ సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా రెవెన్యూ, అటవీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, ఏడి సర్వే కిషన్, తాహాసిల్దార్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



# బీర్కూర్ ప్రధాన రహదారి దుస్థితి

**పట్టించుకోని కాంట్రాక్టర్.. నిద్రమత్తులో రోడ్లు భవనాల శాఖ?**

**బీర్కూర్,/సెప్టెంబర్ 24/(జన సంఘర్షణ)**



బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మురికి నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా సమస్య కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం చూపలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారిపై మురికి నీరు ప్రవహించకుండా కల్వర్టు నిర్మించి, మురికి కాలువలను అనుసంధానం చేయాల్సి ఉన్నప్పటికీ పనులు పూర్తికాకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో రహదారి బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. బీర్కూర్‌కు రాకపోకలకు ఈ రహదారి కీలకమైనదని, పాఠశాల విద్యార్థులు, ప్రజలు వివిధ అవసరాల కోసం ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారని స్థానికులు తెలిపారు. సమస్యపై కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు ఎక్కడ?

బాన్సువాడ--బీర్కూర్ ప్రధాన రహదారిపై రూ. 39 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళ రహదారి చీకటిమయంగా మారడంతో డివైడర్లు వాహనదారులకు స్పష్టంగా కనిపించక ప్రమాదాల ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి

ఎన్నికలు పూర్తయిన తర్వాత రాజకీయాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధికి పాలకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్థానికులు కోరుతున్నారు. రాజకీయ కారణాలతో అభివృద్ధి పనులు నిలిచిపోతే ప్రజలే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీర్కూర్ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని, కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి మురికి కాలువలను అనుసంధానం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే సెంట్రల్ లైటింగ్ పనులను త్వరగా పూర్తి చేసి రాత్రి వేళ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ బురదమయంగా మారిన దృశ్యాలను 'మన తెలుగు జన సంఘర్షణ పత్రిక' తన కెమెరాలో బంధించింది.

# బోధన్ చక్రేశ్వర గణనాథునికి కల్వకుంట్ల కవిత రూ. 50,000 విరాళం.

**బోధన్, సెప్టెంబర్ 24( జన సంఘర్షణ)**



బోధన్ పట్టణంలోని చక్రేశ్వర శివాలయంలో సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి కల్వకుంట్ల కవిత రూ. 50,000 చందా అందజేశారు. ఈ నగదును నవీన్ యాదవ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎం.ఎ. రజాక్ చేతుల మీదుగా, కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖుల సమక్షంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూజారి లింగంకు అందజేయడం జరిగింది. గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఆర్థిక సహకారం అందించిన కవితక్కకు ఉత్సవ కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

## మద్యం దుకాణాలు బంద్

**నిజామా బాద్ సిటీ. సెప్టెంబర్ 24. ( జన సంఘర్షణ)**



గణేశ్ నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అన్ని మద్యం దుకాణాలను మూసివేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, వైన్స్ (IML), 2-B బార్లు, క్లబ్బులు, TD-1, ఝాదీజా తదితర అన్ని రకాల మద్యం విక్రయ కేంద్రాలను శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. గణేశ్ నిమజ్జన శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిర్ణీత సమయాల్లో మద్యం విక్రయాలు జరిపితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జర్నలిస్ట్ పై కేసులు ఎత్తివేయాలి.

**మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదాన్నగారి విఠల్‌రావు డిమాండ్**

**నిజామాబాద్. సెప్టెంబర్ 24( జన సంఘర్షణ )**



జర్నలిస్ట్ బసవరాజుపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదాన్నగారి విఠల్‌రావు ప్రభుత్వాన్ని, పోలీస్ శాఖను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మీడియా నిరంతరం వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్నట్లు పేర్కొన్న అవకతవకలపై కథనం ప్రచురించినందుకే స్టాఫ్ రిపోర్టర్ బసవరాజుపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని ఆయన ఆరోపించారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం సరికాదని విఠల్‌రావు పేర్కొన్నారు. ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బసవరాజుపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, భవిష్యత్తులో పాత్రికేయులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించుకునేలా ప్రభుత్వం, పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని విఠల్‌రావు డిమాండ్ చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

## పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు:ఇన్‌చార్జి కలెక్టర్

**యాదాద్రిభువనగిరి జిల్లా/సెప్టెంబర్ 24(జన సంఘర్షణ):**



జిల్లాలో పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయా అధికారులతో సమావేశం నిర్వహించి పత్తి కొనుగోళ్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఈ ఏడాది పత్తి మద్దతు ధర రూ.8,667గా ఉండగా, 6.75 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.రైతుల సౌకర్యార్థం జిల్లాలోని 13 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాలు, సిబ్బంది, ఇతర మౌలిక వసతులను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్‌రావు తో పాటు అదనపు కలెక్టర్ వెంకారెడ్డి సూచించారు.

## పోతంగల్ వ్యవసాయ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

**భక్తిశ్రద్ధలతో పూజలు.. అన్నదాన కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన భక్తులు**

**పోతంగల్,/ సెప్టెంబర్ 24:/**



పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్‌లో వ్యవసాయ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయకుడి ప్రతిష్ఠాపన జరిగిన రోజు నుంచి మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఇరుముడి మూవీ మండపం వద్ద రవితేజ నటించిన కొత్త చిత్రం ప్రదర్శన భక్తులు, యువతను ఆకట్టుకుంది. అలాగే బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముందు ఉదయం హోమం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల వంటకాలు, స్వీట్లతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండలి సభ్యులు తెలిపారు. 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించి, 12వ రోజు గణేష్ నిమజ్జనం నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు గంగాధర్, క్యాషియర్ ఈరుపపు పవన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. "ప్రతి సంవత్సరం ఇదే విధంగా గణేష్ ఉత్సవాలను కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాం. కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన దాతలు, భక్తులు, మండలి సభ్యులందరికీ వ్యవసాయ గణేష్ మండలి తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు" తెలిపారు.

## బాధిత కుటుంబాలకు ఎన్నారై కోనేరు శశాంక్ ఆర్థిక సహాయం

**ఆరోగ్య పరిస్థితి బాగాలేని కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటానని భరోసా**





**పోతంగల్ ప్రతినిధి/సెప్టెంబర్ 24/(జన సంఘర్షణ):**

రుద్రూర్ గ్రామానికి చెందిన షేక్ మజర్, అబ్దుల్ జమీలుద్దీన్ ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడంతో కోనేరు చారిటబుల్ ట్రస్ట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, ఎన్నారై కోనేరు శశాంక్ మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చి, తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా కోనేరు శశాంక్ మాట్లాడుతూ.. "బాన్సువాడ నియోజకవర్గంలో ఎవరికైనా ఏ ఆపద వచ్చినా నేనున్నానని మర్చిపోవద్దు. నా వంతుగా చేయగలిగిన సహాయం అందిస్తాను" అని తెలిపారు. అలాగే రాబోయే కాలంలో బాన్సువాడ గడ్డపై కాషాయ జెండా ఎగరేయడానికి అందరి సహకారం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, ఉపాధ్యక్షుడు బోజగొండ అనిల్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, జిల్లా నాయకుడు కటిక రామరాజు తదితరులు పాల్గొన్నారు.



# దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు 2026 సెప్టెంబర్ 24న సమర్థించింది

**బాన్సువాడ వైపు అందరి చూపు..**

**పోచారం శ్రీనివాస్‌రెడ్డి భవిష్యత్తు ఏమిటి? ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు పడేనా?**

**నిజామాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ):**

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ బీఫామ్‌పై గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ దాఖలైన పిటిషన్లలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సుప్రీంకోర్టు గురువారం సమర్థించింది. దీంతో మిగిలిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలోనూ న్యాయపరమైన పరిణామాలపై ఆసక్తి నెలకొంది.ఈ నేపథ్యంలో అందరి చూపు ఇప్పుడు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వైపే ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.బాన్సువాడలో పోచారం రాజకీయ ప్రస్థానంపోచారం శ్రీనివాస్‌రెడ్డి 1994 నుంచి బాన్సువాడ రాజకీయాల్లో కీలక నేతగా కొనసాగుతున్నారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ చేతిలో ఓటమి చెందిన ఆయన, 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బాన్సువాడ నుంచి విజయం సాధించారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో టీడీపీ నుంచి బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్)లో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. కేసీఆర్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించడంతో పాటు, 2019లో తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీఫామ్‌పై పోటీ చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డిపై విజయం సాధించారు. 2024లో కాంగ్రెస్‌లో చేరిక 2024 జూన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ విషయాన్ని అప్పట్లో పలు వార్తా సంస్థలు కూడా ధృవీకరించాయి.పార్టీలో చేరిన సందర్భంగా రైతుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. దానం నాగేందర్ కేసుతో మళ్లీ చర్చ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ల నేపథ్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసు కీలక మలుపు తీసుకుంది. సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. ఆయన 2024లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అంశాన్ని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. తాజాగా సెప్టెంబర్ 24న సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో మిగిలిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న కేసులపై రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. పోచారం విషయంలో ఏం జరగనుంది? పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనర్హతపై దాఖలైన పిటిషన్లను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ 2026 జనవరి 15న తిరస్కరించినట్లు అందుబాటులో ఉన్న తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. పిటిషనర్లు ఆయన కాంగ్రెస్‌లో చేరినట్లు నిరూపించే తగిన ఆధారాలు సమర్పించలేదని స్పీకర్ అభిప్రాయపడినట్లు సమాచారం. అయితే దానం నాగేందర్ విషయంలో హైకోర్టు, అనంతరం సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి వ్యవహారం కూడా మరోసారి చర్చకు వచ్చింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం 2024లో బహిరంగంగానే నమోదైంది. అయితే ఆయన ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు పడుతుందా లేదా అన్నది సంబంధిత న్యాయ ప్రక్రియ, కోర్టుల తదుపరి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ఇక బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఇతర ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత వ్యవహారాల్లో న్యాయస్థానాల తదుపరి నిర్ణయాలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి విషయంలో తుది నిర్ణయం ఏ దిశగా ఉండబోతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.గమనిక: మీ అసలు ముసాయిదాలో "పోచారం కాంగ్రెస్‌లో చేరలేదని చెబుతున్నారు" అనే భాగం ఉంది. అందుబాటులో ఉన్న వార్తా ఆధారాల ప్రకారం ఆయన 2024 జూన్‌లో కాంగ్రెస్‌లో చేరినట్లు స్పష్టంగా నమోదైంది, కాబట్టి ఆ భాగాన్ని వాస్తవానికి అనుగుణంగా మార్చాను.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల అవస్థలు







**సబ్ టైటిల్ వైద్యం అందక రోగులు ఎదురుచూపులు,...**

**రాత్రి సమయం లో వైద్యమే కాదు మందులు కూడా కరువే.....**

**గాయాలు పాలయినా వారికీ కనీసం టాబ్లెట్ లు కూడా ఇవ్వలేని సిబ్బంది**

**జన సంఘర్షణ**

భద్రాద్రికొత్తగూడెంజిల్లా అశ్వారావుపేట మండలం అశ్వారావుపేట, :పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల పట్ల సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో వైద్యుల అందుబాటు లేకపోవడం, మందుల కొరత రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.రాత్రి 8 దాటితే ఎదురుచూపులే..గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల నుండి వచ్చే పేద రోగులకు సాయంత్రం 8 గంటల తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందడం లేదు. అత్యవసర (ఎమర్జెన్సీ ) విభాగాలు ఉన్నప్పటికీ, నిపుణులైన వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండటం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో చిన్న పిల్లలకు లేదా వృద్ధులకు హఠాత్తుగా ఆరోగ్యం క్షీణిస్తే, గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. డ్యూటీలో ఉండాల్సిన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.వైద్యం కాదు.. మందులు కూడా కరువే!ఆసుపత్రికి వెళ్తే కనీస మందులు కూడా ఇవ్వడం లేదని, అన్నీ బయట మెడికల్ షాపుల్లోనే కొనాలని డాక్టర్లు చీటీలు రాసి ఇస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. సాధారణ జ్వరం, దగ్గు మందుల నుండి అత్యవసర ఇంజెక్షన్ల వరకు ఆసుపత్రి ఫార్మసీలలో స్టాక్ లేదనే సమాధానమే వస్తోందని పేదలు వాపోతున్నారు. ఉచిత వైద్యం కోసం వస్తే, ప్రైవేట్ మెడికల్ షాపుల్లో వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించాలిప్రభుత్వ ఆసుపత్రులపై పర్యవేక్షణ లోపించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, రాత్రి వేళల్లో వైద్యులు ఖచ్చితంగా అందుబాటులో ఉండేలా చూడాలని, ఆసుపత్రులలో మందుల కొరతను తీర్చాలని రోగులు మరియు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# హంగార్గ ఫారం గ్రామంలో ఘనంగా గౌసే ఆజం దస్తగిరి సందల్





**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**పోతంగల్, సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ):**

పోతంగల్ మండలంలోని హంగార్గ ఫారం గ్రామంలో గౌసే ఆజం దస్తగిరి సందల్ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.సందల్ కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని దస్తగిరి స్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా పోతంగల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షాన్ పాషా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వహించే సందల్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమానికి భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. భక్తుల సహకారంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పాషా, బీఆర్ఎస్ బాబా, పత్రికా మిత్రులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక




# పీఏసీఎస్ ఎన్నికలకు స్వస్తి.. నామినేటెడ్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం

**గత పాలకవర్గాలకు నో ఛాన్స్.. కొత్తవారికే అవకాశం? రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలంటున్న అన్నదాతలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ):**

తెలంగాణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం తీసుకోనున్న నిర్ణయం గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ఎన్నికల నిర్వహణకు బదులుగా నామినేటెడ్ విధానంలో పాలక మండళ్లను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. గత పాలకవర్గాల్లో పనిచేసిన డైరెక్టర్లు, చైర్మన్లకు మరోసారి అవకాశం ఇవ్వకుండా కొత్తవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

పీఏసీఎస్‌లు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా ఉండటంతో కొత్త పాలకవర్గాల ఎంపికపై రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పదవులు రాజకీయ సిఫారసులతో కాకుండా సంఘం అభివృద్ధికి కృషి చేసే వ్యక్తులకు ఇవ్వాలని అన్నదాతలు కోరుతున్నారు.

13 మందితో పాలకవర్గం

సహకార చట్టం ప్రకారం పీఏసీఎస్ పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు ఉంటారు. నామినేటెడ్ విధానం అమలైతే సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే అంశం కూడా కీలకంగా మారనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ మిగిలిన స్థానాలను ఇతర కేటగిరీలతో భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కొత్తవారికే అవకాశం?

నామినేటెడ్ విధానంలో సహకార సంఘంలో సభ్యత్వం ఉన్నవారికి మాత్రమే అవకాశం కల్పించడంతో పాటు, సంఘానికి ఎలాంటి బకాయిలు లేని రైతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గతంలో డైరెక్టర్, చైర్మన్ పదవుల్లో పనిచేసిన వారికి ఈసారి అవకాశం లేకుండా నిబంధనలు రూపొందించనున్నట్లు సమాచారం.దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పీఏసీఎస్ పదవులను ఆశిస్తున్న కొత్త నాయకులు, పార్టీ కార్యకర్తల్లో ఆశలు పెరిగాయి.రాజకీయ సిఫారసులు కాకుండా రైతుల మాట వినాలి పీఏసీఎస్ పాలకవర్గాల నియామకంలో స్థానిక ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు లేదా ఇతర పదవుల్లో ఉన్న వారి సిఫారసులకే ప్రాధాన్యం ఇవ్వకుండా, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు."ఎవరో ఎమ్మెల్యే చెప్పారని, ఎవరో చైర్మన్ సిఫారసు చేశారని పదవులు ఇవ్వకుండా.. గ్రామంలోని రైతుల సమస్యలు తెలిసిన వ్యక్తులను ఎంపిక చేయాలి. సహకార సంఘానికి మేలు చేసే వ్యక్తి ఎవరనేది రైతుల అభిప్రాయంతో గుర్తించాలి" అని రైతులు కోరుతున్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కూడా అవకాశం కల్పించవచ్చని, అయితే కేవలం రాజకీయ సిఫారసు కాకుండా సంఘం ప్రయోజనం, రైతుల సంక్షేమం ప్రధాన ప్రమాణంగా ఉండాలని వారు సూచిస్తున్నారు.

కోట్ల రూపాయల బకాయిలపై రైతుల ఆందోళన

గతంలో కొన్ని సహకార సంఘాల్లో ఆర్థిక వ్యవహారాలు సక్రమంగా సాగలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని సంఘాల్లో ఒక్కొక్కటి సుమారు రూ.1 కోటి నుంచి రూ.7 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్లు వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ మొత్తాలు, బకాయిలకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రతి సహకార సంఘం వారీగా అధికారిక ఆడిట్, రికార్డుల ద్వారా నిర్ధారించాల్సి ఉంది. సహకార సంఘాల ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత తీసుకురావాలని, బకాయిలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి వాస్తవ పరిస్థితులను రైతుల ముందుంచాలని అన్నదాతలు కోరుతున్నారు. ధాన్యం




కొనుగోళ్లలోనూ పారదర్శకత కావాలి గతంలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో కొందరు రైస్‌మిల్లర్లపై అదనంగా ధాన్యం కటింగ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఇలాంటి వ్యవహారాల వల్ల రైతులతో పాటు సహకార సంఘాలకు కూడా నష్టం కలిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర, సరైన తూకం, పారదర్శకమైన కొనుగోలు విధానం ఉండాలని వారు కోరుతున్నారు.

సీఎం, వ్యవసాయ మంత్రి నిర్ణయంపై రైతుల ఆశలు

పీఏసీఎస్ పాలకవర్గాల నియామకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. "ఎమ్మెల్యేలు చెప్పారని, రాజకీయ నాయకులు సూచించారని మాత్రమే కాకుండా.. రైతుల మాట, ప్రజల అభిప్రాయం విని నిర్ణయం తీసుకోవాలి. సహకార సంఘానికి నిజంగా మేలు చేసే వ్యక్తులకే అవకాశం కల్పించాలి" అని రైతులు కోరుతున్నారు.నామినేటెడ్ విధానంలో ఎంపికయ్యే వ్యక్తులు రైతుల సమస్యలను పరిష్కరించేలా, సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా పనిచేయాలని వారు సూచిస్తున్నారు.

'రైతే రాజు' అన్న మాట ఆచరణలో కనిపించాలి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమైతే పీఏసీఎస్ పాలకవర్గాల ఎంపికలోనూ అదే ప్రతిబింబించాలని అన్నదాతలు కోరుతున్నారు. రైతుల సమస్యలు తెలిసినవారికి, సహకార రంగంపై అవగాహన ఉన్నవారికి, సంఘం అభివృద్ధికి కృషి చేసే వారికి అవకాశం కల్పించాలని సూచిస్తున్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి అవకాశం కల్పించడం తప్పు కాదని, అయితే పదవి దక్కిన తర్వాత రైతుల పక్షాన నిలబడి పనిచేసే సామర్థ్యం, నిజాయితీ, సహకార సంఘం అభివృద్ధిపై ఉన్న నిబద్ధతే ప్రధానంగా ఉండాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రైతుల మాటకు ప్రాధాన్యం ఇస్తారా?

పీఏసీఎస్ పాలకవర్గాల ఎంపికపై ప్రభుత్వం తీసుకోబోయే తుది నిర్ణయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రాజకీయ సిఫారసులకు అతీతంగా రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, సహకార సంఘాలకు మేలు చేసే వ్యక్తులను ఎంపిక చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.రైతుల మాటే ప్రాతిపదికగా.. సహకార సంఘాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# 5,811 గణేశ్ విగ్రహాలకు జియో ట్యాగ్

**2,201 విగ్రహాల నిమజ్జనం పూర్తి.. నిమజ్జనాల కోసం 1,300 మంది పోలీసులతో బందోబస్తు**

**నిజామాబాద్, సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ):**

నిజామాబాద్ జిల్లాలో గణేశ్ నిమజ్జనాల నేపథ్యంలో పోలీస్ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తం 5,811 గణేశ్ విగ్రహాలకు జియో ట్యాగ్ చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు.ఇప్పటివరకు 2,201 గణేశ్ విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని సీపీ వెల్లడించారు. మరో 3,599 విగ్రహాలను సెప్టెంబర్ 24, 25 తేదీల్లో నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. 1,300 మంది పోలీసులతో బందోబస్తుగణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా సుమారు 1,300 మంది పోలీసులను బందోబస్తు విధుల్లో వినియోగిస్తున్నట్లు సీపీ సాయి చైతన్య తెలిపారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రధాన నిమజ్జన ప్రాంతాలుగణేశ్ విగ్రహాల నిమజ్జనం కోసం జిల్లాలోని పలు ప్రాంతాలను వినియోగించనున్నట్లు సీపీ తెలిపారు. బాసర, ఉమ్మెడ బ్రిడ్జి, వినాయకుల బావి, బోర్గాం చెరువు, జాన్కంపేట చెరువు, ఆర్మూర్ గుండ్ల చెరువు, కాకతీయ కెనాల్ ప్రాంతాల్లో నిమజ్జనాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగేందుకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, భక్తులు పోలీసులకు



సహకరించాలని అధికారులు సూచించారు.

# జై హనుమాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నప్రసాద కార్యక్రమం


**భక్తిశ్రద్ధలతో గణేశ్ నవరాత్రి వేడుకలు.. భజనలు, కీర్తనలు, చిన్నారుల నృత్యాలు, దాండియా, కోలాటాలతో సందడి**

**కోటగిరి, సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ):**

కోటగిరి మండల కేంద్రంలోని తోటిదుల కాలనీలో జై హనుమాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా జరిగింది. గణేశ్ నవరాత్రి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.గణేశ్ మండలి ఆధ్వర్యంలో మొదటి రోజు నుంచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. ఐదో రోజు, ఏడో రోజు, తొమ్మిదో రోజు, చివరి 11వ రోజు వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాత భక్తి గీతాలతో భజనలు, కీర్తనలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, దాండియా, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.వేడుకల్లో భాగంగా నిర్వహించిన మహా అన్నప్రసాద కార్యక్రమానికి కోటగిరి గ్రామ ప్రథమ పౌరుడు ,బర్ల మధుకర్, కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకుడు తెల్ల రవికుమార్, కోటగిరి ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ స్వరూప తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జై హనుమాన్ గణేష్ మండలి యువకులు, కాలనీ వాసులు అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని అందించారు.గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించడంలో కాలనీ యువకులు, మహిళలు, పెద్దలు అందించిన సహకారం ప్రత్యేకంగా నిలిచింది.

మండలి సభ్యుల కృతజ్ఞతలు

గణేశ్ ఉత్సవాల నిర్వహణకు సహకరించిన కాలనీ వాసులకు, భక్తులకు, పెద్దలకు, యువతకు, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జై హనుమాన్ గణేష్ మండలి సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతోనే ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించగలిగామని పేర్కొన్నారు.



## కట్టమైసమ్మ ఆలయ 17వ వార్షికోత్సవం ఘనంగా

**ప్రత్యేక పూజలు, అభిషేకాలు.. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు**

**బీర్కూర్, సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ):**



పట్టణంలోని బాబాగార్డెన్ చౌరస్తా వద్ద ఉన్న కట్టమైసమ్మ ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పెదకాపు సాయిలు, వీఆర్సీ అధ్యక్షుడు గంగాధర్‌రావు పట్వారీ, కోశాధికారి గామారపేట శ్రీను, మాసుల ప్రసాద్, పెంటయ్య, శ్రీరామ్ సాయిలు, బండారి లింగురం, పోతయ్య, సాయిబాబా, అబ్బులు, బీర్కూర్ అజయ్, కమల శేఖర్ తదితరులతో పాటు మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మొదటి ప్రయత్నంలోనే వీదీదీూలో సీటు.. విద్యార్థికి ఘన సన్మానం

- **మంచి ర్యాంకుతో సీటు సాధించడంపై అభినందనలు.. ఉన్నత విద్యతోనే ఉన్నత భవిష్యత్**

**మద్నూర్, సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ):**



మద్నూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి మొదటి ప్రయత్నంలోనే వీదీదీూలో మంచి ర్యాంకుతో సీటు సాధించడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందిస్తూ ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.గౌరవ ఉపాధ్యాయులు రేఖవార్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, మల్లేశం, పట్టాభి తదితరులు విద్యార్థిని సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థి సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కృష్ణ పటేల్, మాజీ సర్పంచ్, సీనియర్ రిపోర్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు మంచి విద్య ఎంతో అవసరమని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు.మద్నూర్ మండలానికి చెందిన విద్యార్థి మొదటి ప్రయత్నంలోనే వీదీదీూలో సీటు సాధించడం మండలానికి గర్వకారణమని అన్నారు. ఈ విజయం విద్యార్థి పట్టుదల, కృషితో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహానికి నిదర్శనమని పేర్కొన్నారు.విద్యార్థి సాధించిన విజయాన్ని ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తనను సన్మానించి, అభినందించిన ఉపాధ్యాయులు, పెద్దలు, శ్రేయోభిలాషులకు విద్యార్థి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థి విజయంతో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.

## రూ.9 కోట్ల బంగారం పట్టివేత.. చైన్లపై వెండి, నలుపు రంగు స్ప్రే చేసి స్మగ్లింగ్‌కు యత్నం

**ఢిల్లీ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం స్వాధీనం.. 6.5 కిలోల బంగారం సీజ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 / (జన సంఘర్షణ,)**




ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీగా బంగారం అక్రమ రవాణా వ్యవహారాన్ని ఛేదించారు. దుబాయ్ నుంచి ఢిల్లీ వచ్చిన విమానంలో సుమారు 6.5 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.9 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ కేసులో ఒక మహిళ సహా మొత్తం ఎనిమిది మంది ప్రయాణికులను అరెస్ట్ చేశారు.కస్టమ్స్ అధికారులకు అందిన పక్కా సమాచారంతో సెప్టెంబర్ 21న దుబాయ్ నుంచి ఢిల్లీ వచ్చిన ఎమిరేట్స్ విమానం ఙఖ-514లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో విమానంలోని రెండు సీట్ల కింద మూడు చిన్న బ్యాగులు కనిపించడంతో వాటిని తనిఖీ చేశారు. బ్యాగుల్లో బంగారం చైన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చైన్లపై వెండి, నలుపు రంగు స్ప్రే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్మగ్లర్లు బంగారాన్ని చైన్ల రూపంలో తయారు చేసి, వాటిపై వెండి, నలుపు రంగు స్ప్రే చేశారు. బంగారం సాధారణ ఆభరణాల మాదిరిగా కనిపించేలా రూపాన్ని మార్చి, కస్టమ్స్ అధికారుల దృష్టికి రాకుండా అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. ప్రయాణికులకు అధికారుల హెచ్చరిక బంగారాన్ని వివిధ రూపాల్లో మార్చి, ఇతర లోహాలు లేదా రంగులతో కప్పి అక్రమంగా తరలించే ప్రయత్నాలు చట్టపరమైన చర్యలకు దారితీస్తాయని కస్టమ్స్ అధికారులు హెచ్చరించారు. విమాన ప్రయాణికులు అక్రమంగా బంగారం లేదా ఇతర విలువైన వస్తువులను తరలించే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అనుమానాస్పద వస్తువులను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ ఘటనపై అధికారులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ధ్యాన కేంద్రంలో వ్యక్తి ఆత్మహత్య

**గదిలో ఉరేసుకున్న స్థితిలో మృతదేహం గుర్తింపు**

**ఎడపల్లి, సెప్టెంబర్ 24 (జన సంఘర్షణ):**



నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం పోచారంలోని విపాసన ధ్యాన కేంద్రంలో చికిత్స కోసం చేరిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది.ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన డోంగ్రే అశోక్ (55)ను కుటుంబ సభ్యులు ఈ నెల 16న పోచారంలోని విపాసన ధ్యాన కేంద్రంలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న అశోక్ గురువారం మధ్యాహ్నం గది నుంచి బయటకు రాకపోవడంతో నిర్వాహకులు అనుమానం వచ్చి గదిని పరిశీలించారు. ఈ క్రమంలో అశోక్ ఉరేసుకున్న స్థితిలో కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# జీవితాంతం నీవు నా దగ్గరే ఉంటావు: విజయ్ దేవరకొండ



**విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న 'రణబాలి'**

**విజయ్ పై ఏమాత్రం క్రష్ తగ్గలేదన్న రష్మిక**

**అంతే ప్రేమతో సమాధానమిచ్చిన విజయ్ దేవరకొండ**

రియల్ లైఫ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ 'సింగనమల బొబ్బిలి రణబాలి'గా పవర్‌ఫుల్ పాత్రలో అలరించనుండగా, ఆయనకు జోడీగా రష్మిక 'జయమ్మ' పాత్రలో నటిస్తోంది. ఇటీవల విడుదలైన 'ఏందయ్యా సామీ..' పాట యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా విశేష ప్రజాదరణ పొందుతోంది. తాజాగా, ఈ పాటలోని ఒక రొమాంటిక్ క్లిప్‌ను రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ... అతను పూర్తిగా తనకే సొంతమయ్యాడని, కానీ అతనిపై ఉన్న క్రష్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని కామెంట్ చేసింది. దీనికి విజయ్ దేవరకొండ రిప్లై ఇస్తూ... "నేను ఎంతో అదృష్టవంతుడిని. నేను జయమ్మని మిస్ అవుతాను కానీ.. జీవితాంతం నువ్వు నా దగ్గరే ఉంటావు" అని ఎంతో ప్రేమగా స్పందించాడు. ఈ సరదా సంభాషణ మరియు వారి మధ్య ఉన్న అనుబంధం చూసి అభిమానులు మురిసిపోతున్నారు. మరోవైపు, ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తుండగా... మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## నాకు ఇది పునర్జన్మ.. దయచేసి హెల్మెట్ పెట్టుకోండి: సాయి దుర్గ తేజ్ ఎమోషనల్ పోస్ట్!

టాలీవుడ్ నటుడు సాయి దుర్గ తేజ్ ఐదేళ్ల క్రితం తాను ఎదుర్కొన్న ఘోర రోడ్డు ప్రమాదాన్ని గుర్తుచేసుకుంటూ నేడు ఓ భావోద్వేగ ప్రకటన విడుదల చేశారు. ప్రమాదం జరిగిన రోజును తన 'పునర్జన్మ దినం'గా పేర్కొంటూ, హెల్మెట్ పెట్టుకోవడం అనే ఒక్క చిన్న నిర్ణయం వల్లే తాను ఈ రోజు బతికున్నానని తెలిపారు. అభిమానులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో 'పునర్జన్మ-దినం' పేరుతో ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. "నా కుటుంబానికి, స్నేహితులకు, అభిమానులకు, ప్రతి సినీ ప్రేమికుడికి.. సరిగ్గా ఐదేళ్ల క్రితం మీ ప్రార్థనలు, ప్రేమ, బేషరతు మద్దతుతో నాకు రెండో జీవితం లభించింది. గాయాల నుంచి నేను 90% కోలుకున్నాను. ఇంకా నా మాటలో, మరికొన్ని ఇతర సవాళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. కానీ వాటిని అధిగమిస్తున్నాను. ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నాను" అని పేర్కొన్నారు. "మీ ప్రేమ నన్ను ఎప్పుడూ వీడలేదు. ప్రతీ కష్టమైన రోజు, ఎదురైన ప్రతీ ఎదురుదెబ్బ, వదిలేయడం సులభం అనిపించిన ప్రతి క్షణంలోనూ నాకు అండగా నిలిచి బలాన్నిచ్చింది. ఐదేళ్ల తర్వాత ఇక్కడ ఉన్నాను. ఇంకా నిలబడి ఉన్నాను. పోరాడుతూనే ఉన్నాను. జీవిస్తూనే ఉన్నాను. మీ ప్రార్థనలకు, శుభాకాంక్షలకు, సందేశాలకు, మీరు చూపిన ప్రేమకు ధన్యవాదాలు. మీరు లేకుండా నేను ఇక్కడ ఉండేవాడిని కాదు" అని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన కథ నుంచి అభిమానులు ఒక ముఖ్యమైన విషయం నేర్చుకోవాలని ఆయన కోరారు. "దయచేసి హెల్మెట్ పెట్టుకోండి. ఆ ఒక్క చిన్న నిర్ణయమే నేను ఈ రోజు ఇక్కడ ఉండటానికి కారణం" అని తన ప్రకటనలో రాసుకొచ్చారు. సాయి దుర్గ తేజ్ 2021 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్పోర్ట్స్ బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి కిందపడటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ఇక, సినిమాల విషయానికొస్తే.. సాయి దుర్గ తేజ్ ప్రస్తుతం దర్శకుడు రోహిత్ కేపీ రూపొందిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'సంబరాల ఏటి గట్టు'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.




FIVE YEARS WITH GRATITUDE

Rebirth-Day

*To my family, friends, fans and every movie lover,*

Five years ago today, I was given a second chance at life, carried through by your prayers, love and unconditional support. I needed every single one of them.

I've recovered 90% from my injuries. There are still a few things I'm working through, my speech and a few other challenges, but I'm getting there. One day at a time.

What I want you to know is this: your love never left my side. It gave me the strength to push through every difficult day, every setback and every moment when giving up would have been easier.

**And here I am. Five years later. Still standing. Still fighting. Still living.**

Thank you for every prayer, every good wish, every message and every bit of love. I wouldn't be here without you.

And if there is just one thing I want you to take away from my story:

PLEASE WEAR A HELMET.

*That one small decision is the reason I'm here today.*

మీ ప్రేమకు ధన్యవాదాలు

With all my love ♥



# శర్వానంద్ 'జార్జ్ క్రిష్' నుంచి కీలక అప్‌డేట్.. హీరోయిన్ ఎవరో తేలిపోయింది!

**'జార్జ్ క్రిష్'లో హీరోయిన్‌గా మానస వారణాసి**

**'కపుల్ ఫ్రెండ్లీ'తో మానసకు మంచి గుర్తింపు**

**సంగీతం అందించనున్న అనూప్ రూబెన్స్**

హీరో శర్వానంద్ కొత్త సినిమా 'జార్జ్ క్రిష్'పై మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మానస వారణాసిని ఎంపిక చేశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఇటీవల మంచి గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'జార్జ్ క్రిష్'లో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. శర్వానంద్ వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్నారు. 'నారి నారి నడుమ మురారి', 'బైకర్' సినిమాలు ఇటీవల ప్రేక్షకులను అలరించాయి. 'జార్జ్ క్రిష్'ను ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు. శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ కూడా ఉంది. 'శతమానం భవతి', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'నారి నారి నడుమ మురారి' వంటి సినిమాలు సంక్రాంతి బరిలోకి వచ్చి విజయాలు అందుకున్నాయి. దీంతో 'జార్జ్ క్రిష్'పై అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవలే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్చాన్ చేయగా.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లాప్ కొట్టారు. తొలి షాట్‌కు శ్రీను వైట్ల దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ కథ అందించారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co